క్లుప్తంగా

మిర్చితో రాస పోలమాంబకు అలంకరణ



పండు మిర్చి, పచ్చి మిర్చి అలంకరణతో రాస పోలమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను మంగళవారం పండు మిర్చి, పచ్చి మిర్చి, మల్లె, కనకాంబరం, గులాబీ, కాగడాల పువ్వులతో ఆలయ కమిటీ ప్రతినిధులు అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ అలంకరణకు కృష్ణం రాజుపేట గ్రామానికి చెందిన పల్లా సన్యాసి, కొండమ్మ దంపతులు సహకరించారు. మజ్జివలసకు చెందిన తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదం పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది

తగరపువలస: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది సంగివలస వరల్డ్ అమేయా స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అపార్ట్‌మెంట్లు, విద్యుత్ సంబంధమైన ప్రమాదాలు, గ్యాస్ ప్రమాదాల సమయంలో ఎలా అప్రమత్తంగా వ్యవహరించాలో తెలియజేశారు. అగ్నిమాపక పరికరాల పనితీరును ప్రదర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులచే పరీక్షింపజేశారు. టియర్ గ్యాస్, నీరు, ఫోమ్ ఉపయోగించి మంటలు అదుపు చేయడంపై వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అంధకారం



తాళ్లవలస వద్ద చీకటిగా ఉన్న జాతీయ రహదారి

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ నుంచి పెద్దిపాలెం వరకు జాతీయ రహదారి, సర్వీస్ రోడ్డులో చీకట్లు అలుముకున్నాయి. జాతీయ రహదారిపై మలుపుతో కూడిన ఈ ప్రాంతంలో వాహనాలు వేగంగా వస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాగే సంగివలస సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు వెలగకపోవడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.

34 మద్యం బాటిళ్లు స్వాధీనం

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి 34 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రేవిడిలో విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామానికి చెందిన ఈజరోతు ఈశ్వరావు నుంచి 12, పద్మనాభం జంక్షన్‌లో కృష్ణాపురం గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాసరావు నుంచి 22 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

4వ వార్డులో 9 మద్యం బాటిళ్లు...

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం నుంచి చేపలుప్పాడ వైపు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న 9 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే టీడీపీ కార్యకర్తలకు పంపిణీ చేసేందుకు ఈ మద్యం బాటిళ్లు తరలిస్తున్నారని పలువురు అంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు.

పరిపాలన రాజధానితో ఉజ్వల భవిష్యత్

- సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే పేదలందరికీ మరింత మేలు
- వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

పద్మనాభం: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే పేదలందరికీ మరింత మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. మండలంలోని కృష్ణాపురం, పద్మనాభం, మద్ది గ్రామాల్లో వైఎస్సార్ సీపీ భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్ మోహన్ రెడ్డికి రెండు కళ్లలాంటివన్నారు. గత ఐదేళ్లలో ప్రతీ కుటుంబానికి సీఎం జగన్ ఎంతో మేలు చేకూర్చారన్నారు. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. తమది చేతల ప్రభుత్వమని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో పేద ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. టీడీపీ నాయకులు దోచుకుని, దాచుకున్నారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచి పేద ప్రజల వైద్యానికి సీఎం జగన్ భరోసానిచ్చారన్నారు. సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే విశాఖలోని భీమునిపట్నం నియోజకవర్గం నుంచి పరిపాలన సాగిస్తారని తెలిపారు. పరిపాలన రాజధాని వల్ల విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడి పిల్లల భవిష్యత్ బాగుంటుందన్నారు. పరిపాలన రాజధాని వల్ల రాష్ట్రంలో భీమునిపట్నం నియోజకవర్గం కీలకమవుతుందన్నారు. తమను గెలిపిస్తే పద్మనాభం అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు.



మద్ది గ్రామంలో వైఎస్సార్ సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు భారీ గజమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గంటాను చిత్తుగా ఓడించండి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో భీమునిపట్నం నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రిగా పనిచేసి ప్రజలకు ముఖం చూపించని గంటా శ్రీనివాసరావును ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. పొరపాటున గంటా శ్రీనివాసరావును గెలిపిస్తే కొండలు, ఇసుక, గ్రావెల్, భూములను దోచుకుంటారన్నారు. కృష్ణాపురం, పద్మనాభం గ్రామాల్లో ఈనాం భూముల రైతులకు రైతు భరోసా ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనన్నారు. పేదల పక్షాన నిలిచే వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. పెత్తందారుల పక్షాన నిలిచే వ్యక్తి చంద్రబాబు అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి నాగవంశీయులకు సీఎం జగన్ గుర్తింపునిచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. బొత్స ఝాన్సీలక్ష్మి, ముత్తంశెట్టి శ్రీనివాసరావును పద్మనాభం వంతెన నుంచి భారీ బైక్, ఎడ్ల బళ్ల ర్యాలీతో మద్ది గ్రామంలోకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో విజయనగరం డీసీఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అవనాపు విక్రమ్, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు తులసి లక్ష్మి, నాయకులు గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు, బొలె అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, బుగత శ్రీనివాసరావు, సిరుగుడి ఆదినారాయణ, మాదిరెడ్డి భాస్కరరావు, కోన రమణ, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు.



కృష్ణాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మి

నామినేషన్లకు పక్కా ఏర్పాట్లు

ఎన్నికల నిర్వహణ అధికారి, ఆర్‌డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: సార్వత్రిక ఎన్నికల కోసం ఈ నెల 18 నుంచి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని, అందుకు అనుగుణంగా పక్కాగా ఏర్పాట్లు చేయనున్నామని ఎన్నికల నిర్వహణ అధికారి, ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వచ్చే సమయాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. వారు నిర్వహించే ర్యాలీల ఖర్చులు అభ్యర్థుల ఖాతాల్లోకి వెళ్తాయని, ముందుగా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇక్కడి కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ర్యాలీ, వాహనాలు నిలిపివేయాలని, అభ్యర్థితో కలిసి ఐదుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తామని తెలిపారు. అలాగే ప్రతీ అభ్యర్థి నామినేషన్ దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి, సరిచూసుకుని రావాలని సూచించారు. చాలా ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఆయా యజమానుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా జరుగుతున్నాయని, ఎక్కడా సమస్యలు రాకుండా చూసుకుంటున్నామని వెల్లడించారు. నాయకులు భాగం గోపాలరావు, గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎన్నికల నిర్వహణ అధికారి భాస్కరరెడ్డి, పలు పార్టీల నాయకులు

మంచి నీటి కొరత లేకుండా చర్యలు

పద్మనాభం: వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో మంచి నీటి కొరత ఉండకూడదని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో మంచి నీటి సమస్య తలెత్తితే తక్షణమే పరిష్కరించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంపీడీవో బి.శైలజ, వ్యవసాయ శాఖ అధికారి ఎం.వి.ఎస్.చలం, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మణికుమారి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ప్రభాకర్, ఉపాధి హామీ పథకం ఏపీవో వరలక్ష్మి, పలు శాఖల అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



సెక్రటరీ గౌరికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే చేపలుప్పాడ సచివాలయం పరిధిలో వలంటీర్లు రాజీనామా చేయగా తిమ్మాపురం, మంగమారిపేటకు చెందిన వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సెక్రటరీ గౌరికి అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరలా రాష్ట్రంలో ప్రజల వద్దకు పాలన కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఇక నుంచి జగనన్న సైనికుల్లా పనిచేస్తూ, ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అఖండ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



సచివాలయ కార్యదర్శి సౌదామినికి రాజీనామాలు అందిస్తున్న వలంటీర్లు

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేట పంచాయతీకి చెందిన 9 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి సౌదామిని ద్వారా ఎంపీడీవో జానకికి పంపించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ చంద్రబాబు తమపై చేస్తున్న ఆరోపణలతో మనస్తాపం చెంది స్వచ్ఛందంగా రాజీనామాలు చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో తామంతా గౌరవంగా పనిచేసినట్టు గుర్తు చేశారు.

తాటిచెట్లు దగ్ధం

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటిచెట్లు దగ్ధమయ్యాయి. గంధవరం వెళ్లే మార్గంలో ఈ చెట్లు కాలిపోయాయి. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. ఎవరైనా కాల్చిన సిగరెట్ పడేయడం వల్ల ప్రమాదం సంభవించి వుంటుందని భావిస్తున్నారు.



దగ్ధమైన తాటిచెట్లు

సేవ చేసే వారినే గెలిపించండి

విస్తృతంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రచారం

కొమ్మాది: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయం పేరుతో వ్యాపారం చేసే వారిని కాకుండా సేవ చేసే వారిని ఓటుతో ఆశీర్వదించి గెలిపించాలని కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక కోరారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది సమీప కే1 కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ఐదేళ్లకోసారి చుట్టం చూపుగా చూసే రాజకీయ నాయకులను నమ్మవద్దని, కష్టం వస్తే నేనున్నానంటూ భరోసానిచ్చే ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, గాదె రోశిరెడ్డి, పోతిన ఎల్లాజీ, వరలక్ష్మి, అవతార్ సింగ్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ 8వ వార్డు గణేష్‌నగర్, రెడ్డీల కాలనీ, రాజీవ్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, మాదు చంటి, శ్రీనివాసరెడ్డి, పవన్, తదితరులు పాల్గొన్నారు.



కే1 కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక



తర్లువాడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆనందపురం: మండలంలోని తర్లువాడలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం సాయంత్రం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మజ్జి రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులకు ప్రజల నుంచి అడుగడుగునా ఆదరణ లభిస్తోంది. జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ రోడ్డులోని ముత్యాలమ్మ కాలనీ, గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు ఇతర నాయకులు కొండవాలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులనే గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, జేఎస్ రెడ్డి, కూన రమణ, నూకవరపు బాబ్జి, గురిగిబిల్లి రంగారావు, బొడ్డేపల్లి లోకనాథం, పేడాడ వెంకటరావు, గౌతమి, జయ, నిర్మల్, శేఖర్, చేకూరి రజని, పోతిన శేషుబాబు, రుషికేష్, ప్రసాద్, సీత, కొల్లి గణేష్, ఉప్పాడ శివారెడ్డి, ఉగ్గిన నాగరాజు, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మ కాలనీలో ప్రచారం చేస్తున్న పోతిన హనుమంతురావు, తదితరులు



8వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు

సీఎం జగన్ పాలనలోనే పేదలకు మేలు

- మునుపెన్నడూ జరగనంతగా భీమిలి నియోజకవర్గ అభివృద్ధి
- కూటమి కుట్రలు దాటుకుని వైఎస్సార్ సీపీ విజయం ఖాయం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే పేదలకు ఎంతో మేలు జరిగిందని, అందువల్లే బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరగనున్న ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి, ఇతర పార్టీలకు మధ్య కాదని... పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఈ యుద్ధంలో పేదలు గెలవాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. జీవీఎంసీ 3వ వార్డు పరిధిలోని రెల్లివీధి, కొంకువీధి, అప్పికొండవీధి, గాడు వీధి ప్రాంతాల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చారన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. జీవీఎంసీ 3వ వార్డుల్లో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. గత ప్రభుత్వ పాలనకు, సీఎం జగన్ సంక్షేమ పాలనకు మధ్య తేడా గమనించాలని సూచించారు.

గంటా మాయమాటలు నమ్మొద్దు

తాను గెలిచినప్పటి నుంచి గత ఐదేళ్లుగా ప్రజలకు అందుబాటులో వుంటూ వారి సమస్యలు పరిష్కరించానన్నారు. కరోనా సమయంలోనూ అందరికీ తనవంతు సహకారం అందించానని పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గతంలో ఇక్కడ గెలిచిన తర్వాత ఒక్కసారి కూడా ప్రజలకు అందుబాటులో లేరన్నారు. గత ఐదేళ్లుగా ఈ నియోజకవర్గం వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో మళ్లీ మాయమాటలు చెబుతున్నారని, వాటిని నమ్మితే ఎన్నికలు అయిపోయాక ఐదు సంవత్సరాలు గంటా కనిపించరన్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గంలోని ప్రజలంతా జాగ్రత్తగా గమనించాలని, తనను గెలిపిస్తే మీ ఇంటివాడిగా, ఒక సేవకుడిగా అందరికీ అందుబాటులో వుంటానని హామీ ఇచ్చారు. అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయిన వెంటనే విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని, అప్పుడు అందరికీ మరింత మేలు జరుగుతుందన్నారు.

ప్రచారంలో వైఎస్సార్ సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు ముక్కి కృష్ణ, వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజీ, అక్కరమాని రామునాయుడు, కొప్పల రమేష్, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, వాసుపల్లి ఎల్లాజీ, చెల్లూరి గౌరినాయుడు, జి.మధునాయుడు, మారుపల్లి రాము, జీరు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



యువతులకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మహిళలకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

1.59 లక్షల నగదు సీజ్

పద్మనాభం: మండలంలోని చిన్నాపురం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో రూ.1.59,500 నగదును పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం చిన వెదుర్లవలసకు చెందిన గుల్లపల్లి వెంకట సత్యం కారులో ఈ నగదు పట్టుబడింది. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి జిల్లా ఎలక్షన్ గ్రీవెన్స్ సెల్‌కు పంపించారు.



స్వాధీనం చేసుకున్న నగదుతో అధికారులు

మహిళపై మందుబాబు దాడి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ చేపల బజార్ సమీపంలో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో రహదారిపై నడిచి వెళ్తున్న మహిళపై ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. గుడ్లవానిపాలెం నుంచి ఓ మహిళ సాగర్‌నగర్ వైపు వస్తుండగా మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తి ఆమె చీరను లాగి మెడకు చుట్టి దాడి చేశాడు. ఆమె ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానిక యువకులు ఆ వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ వ్యక్తి ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాడనే వివరాలు తెలియరాలేదు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆత్మీయ ఆశీర్వాదం : జీవీఎంసీ రెండోవార్డు సత్యనారాయణపేటలో వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి తెడ్లాపు అప్పలరాజు ఇంటికి వెళ్లి ఆయన కుమార్తె గాయత్రిని ఆశీర్వదించారు.

\- తగరపువలస

ఎండ వేడిమితో అవస్థలు



ఎండ వేడిమి తాళలేక ప్రభుత్వ చలివేంద్రం వద్ద నీరు తాగుతున్న విద్యార్థులు

మధురవాడ: వేసవిలో ఎన్నడూ లేనంతగా మంగళవారం ఎండ వేడిమి, వడగాల్పులతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో ఎండ వేడిమి మరింత ఎక్కువ కావడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు చల్లని పానీయాలు లభ్యమయ్యే చోట, నీడ ఉన్న చోటకు చేరి సేదతీరారు. ఈ పరిస్థితి మధురవాడలో వివిధ చోట్ల కనిపించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు విద్యార్థులు, వాహనదారులు, పాదచారులకు ఆసరాగా నిలిచాయి.